**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది: 17.10.2026** **సమయం: 13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. హైదరాబాద్, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో 78వ దీక్షాంత్ పరేడ్ ను ఘనంగా నిర్వహించి, ప్రతిభ కనబరిచిన ప్రొబేషనర్లకు అవార్డులు అందజేశారు.
2. యువతలో క్రీడాస్ఫూర్తిని, ఆరోగ్యంపై అవగాహనను పెంపొందించేందుకు 'ట్రై సిటీస్ హాఫ్ మారథాన్–2026' 5 కి.మీ. పరుగును ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు జెండా ఊపి ప్రారంభించారు.
3. దసరా పండుగను పురస్కరించుకుని సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో హైదరాబాద్ లోని ప్రధాన బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. రద్దీకి అనుగుణంగా తెలంగాణ ఆర్టీసీ 7 వేల ప్రత్యేక బస్సులను నడుపుతోంది.
4. రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. మహిళలు పెద్ద సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొంటున్నారు.

…………………………………………………………

## DIKSHANT PARADE

హైదరాబాద్, సర్దార్ వల్లభభాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో ఐపీఎస్ 78వ బ్యాచ్‌లో భాగంగా మొత్తం 151 మంది అధికారులు శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరిలో 135 మంది ఐపీఎస్ అధికారులు కాగా, మరో 16 మంది నేపాల్, భూటాన్, మాల్దీవులకు చెందిన అధికారులు కూడా శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ బ్యాచ్‌లో 37 మంది మహిళా అధికారులు

ఉండటం విశేషం. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ పరేడ్‌ను సమీక్షించారు. అధికారుల కవాతు, క్రమశిక్షణ, సమన్వయాన్ని పరిశీలించారు. అనంతరం శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు అవార్డులు అందజేశారు. ఈ బ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఎనిమిది మంది, తెలంగాణకు ఇద్దరు ఐపీఎస్ అధికారులను కేటాయించారు. ఈ సందర్భంగా కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ మాట్లాడుతూ... వామపక్ష తీవ్రవాదం, ఈశాన్య ప్రాంతాల తిరుగుబాటు వంటి సాంప్రదాయ భద్రతా సవాళ్లు తగ్గినప్పటికీ, యువ అధికారులు ఐదు కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగం, సులభంగా వ్యాపిస్తున్న సైబర్ నేరాలు, పొంచి ఉన్న స్వదేశీ, విదేశీ తీవ్రవాదం, వనరులకు ముప్పుగా మారుతున్న అక్రమ విదేశీయుల చొరబాట్లు, సాంకేతికత ఆధారంగా నేరస్థులు దాక్కునే నేరాలు వీటిలో ముఖ్యమైనవిగా పేర్కొన్నారు.

**బైట్ ... గోవింద్ మోహన్**

ప్రసంగాల అనంతరం గోవింద్ మోహన్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రొబేషనర్లకు ట్రోఫీలు, కప్ లను అందజేశారు.

....MSV/RNU-HYD

**ట్రై సిటీస్ హాఫ్ మారథాన్–2026'**

యువతలో క్రీడాస్ఫూర్తిని, ఆరోగ్యంపై అవగాహనను పెంపొందించేందుకు నిర్వహించిన 'ట్రై సిటీస్ హాఫ్ మారథాన్–2026' రెండో విడత 5 కిలోమీటర్ల పరుగును ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జెండా ఊపి ప్రారంభించారు. హన్మకొండలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... శారీరక వ్యాయామం, క్రీడల ద్వారా ఒత్తిడిని, అనారోగ్య సమస్యలను అధిగమించవచ్చని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని

పిలుపునిచ్చారు. వరంగల్, హన్మకొండ నగరాల అభివృద్ధితో పాటు గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

.....డెస్క్

**అర్బన్ ఛాలెంజ్**

అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌తో గ్రేటర్ వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి డాక్టర్ టి.కె. శ్రీదేవి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ వెంకన్నతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరంలో మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక కార్యకలాపాల విస్తరణ, రవాణా, తాగునీరు, పారిశుధ్యం, పట్టణ పునరుద్ధరణకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను వివరించారు.

...పీటీసి- వరంగల్

**రీ సర్వే**

భూముల రీ సర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు, గ్రామ పాలనా అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారానికి, రికార్డుల ప్రక్షాళనకు రీ సర్వే ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.

....పీటీసి- వరంగల్

**మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలి**

తక్షణ రుణాలు ఇస్తామంటూ ఆన్‌లైన్‌లో మోసాలకు పాల్పడే నకిలీ లోన్ యాప్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు. ఎస్పీ కార్యాలయంలో సైబర్ నేరాలపై ఏఎస్పీ చిత్తరంజన్‌తో కలిసి ఆమె అవగాహన పోస్టర్‌ను

ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... లోన్ మంజూరుకు ముందే ప్రాసెసింగ్ ఫీజులు, సర్వీస్ చార్జీల పేరుతో డబ్బులు అడిగితే చెల్లించవద్దన్నారు. వ్యక్తిగత, బ్యాంక్ ఖాతా వివరాలు, పిన్, ఓటీపీలను ఎవరికీ వెల్లడించవద్దని, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

...పిటిసి- ఆసిఫాబాద్

**బండి సంజయ్**

కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా దుర్గా నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని చైతన్యపూరి కాలనీలో గల శ్రీ మహాశక్తి ఆలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ఆకాశవాణితో మాట్లాడుతూ...

**బైట్ ... బండి సంజయ్**

....పిటిసి- కరీంనగర్

**ఎల్ నినో**

ఎల్ నినో ప్రభావంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తాగునీరు, వ్యవసాయం, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సూక్ష్మస్థాయి ప్రణాళికలు రూపొందించాలని ప్రత్యేక అధికారి, రాష్ట్ర కార్మిక శాఖ కార్యదర్శి దాసరి హరిచందన ఆదేశించారు. నల్లగొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు.

...పిటిసి- నల్గొండ

**శ్రీ రాజరాజేశ్వరీదేవి**

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి, శ్రీ భీమేశ్వరస్వామి ఆలయాల్లో శ్రీ రాజరాజేశ్వరీ దేవి అమ్మవారు ఏడో రోజు కాళరాత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మీగణపతి

స్వామివారికి అధర్వశీర్ష పఠనంతో అభిషేక పూజలు, మూలవిరాట్టుకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

...పిటిసి- రాజన్న సిరిసిల్ల

**ఆర్టీసీ దసరా**

దసరా పండుగను పురస్కరించుకుని సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో హైదరాబాద్‌లోని ప్రధాన బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. రద్దీకి అనుగుణంగా తెలంగాణ ఆర్టీసీ 7 వేల ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ట్రాఫిక్ నివారణకు ఉప్పల్, ఎల్బీనగర్, ఆరాంఘర్ వంటి శివారు ప్రాంతాల నుండి బస్సులు అందుబాటులో ఉంచారు.

...డెస్క్

**సీఎం – యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్**

హైదరాబాద్ శిల్పకళా వేదికలో బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్-2026 అవార్డుల ప్రధానోత్సవం ఘనంగా జరుగుతోంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు.

...డెస్క్

**బతుకమ్మ సంబరాలు అంబర్‌పేట్**

హైదరాబాద్ అంబర్‌పేట్ గ్రౌండ్‌లో 72 అడుగుల రికార్డు స్థాయి బతుకమ్మ సంబరాలు ఈరోజు సాయంత్రం జరుగుతాయి. దాదాపు 25 క్వింటాళ్ల రకరకాల పూలతో దేశంలోనే అతిపెద్ద బతుకమ్మను పేర్చుతున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఈ వేడుకల్లో మహిళలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని, మంత్రి పిలుపునిచ్చారు.

...డెస్క్

**బతుకమ్మ వేడుకలు, రవీంద్రభారతి,**

హైదరాబాద్ రవీంద్రభారతి ప్రాంగణంలో భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఏడో రోజు 'వేపకాయల బతుకమ్మ' పేరిట వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు

హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు ముఖ్య అతిథులుగా హాజరై బతుకమ్మ పండుగ విశిష్టతను కొనియాడారు. సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సతీమణి సుజన ప్రత్యేకంగా హాజరై, బీసీ సంఘం, నర్సింగ్ అసోసియేషన్ మహిళలతో కలిసి బతుకమ్మల చుట్టూ ఆడిపాడారు.

...డెస్క్

**బతుకమ్మ**

తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి బతుకమ్మ పండుగ ప్రతీక అని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. జిల్లా కేంద్రంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు.

...పీటీసీ-నల్లగొండ

**బతుకమ్మ వేడుకలు - సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలో సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వేములవాడలో ఏడో రోజే సద్దుల బతుకమ్మ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆరు రోజుల పాటు చిన్న బతుకమ్మలతో ఆడిపాడిన మహిళలు, ఏడో రోజు రంగురంగుల పూలతో పెద్ద బతుకమ్మలను అందంగా పేర్చారు.

...పిటిసి- రాజన్న సిరిసిల్ల జిల్లా

**మేడ్చల్ కలెక్టరేట్**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు వైభవంగా జరుగుతున్నాయి. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ సతీమణి రాధా, మహిళా అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

..పీటీసీ- మేడ్చల్ మల్కాజిగిరి

**వాతావరణం**

రాష్ట్రంలో ఈనెల 22 వరకు విస్తారంగా వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈశాన్య రుతుపవనాల ప్రభావం, దక్షిణ కోస్తాంధ్రపై ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా ఈ వర్షాలు కురుస్తున్నాయని పేర్కొంది.

...డెస్క్